కంచి పరమాచార్య

శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి

**అమృతవాణి**

**9**

# — గురు సంప్రదాయం —

అనువక్త

దేవరకొండ శేషగిరిరావు

ఎమెస్కో

# విషయ సూచిక


| | |
|---|---|
| అధ్యాయం - 1 | 7-34 |
| అధ్యాయం - 2 | 35-55 |
| అధ్యాయం - 3 | 56-93 |
| అధ్యాయం - 4 | 94-124 |
| అధ్యాయం - 5 | 125-169 |
| అధ్యాయం - 6 | 170-209 |
| అధ్యాయం - 7 | 210-244 |

# అధ్యాయం-1

## రాజు - రాణి చరిత్ర

అనగనగా ఒక రాజు. రాజని ఎప్పుడైతే అంటామో అతనికి శత్రువైన రాజూ ఉంటాడని, ఇద్దరికీ యుద్ధం జరుగుతుందని భావిస్తాం కదా! మనమనుకొన్నట్లే యుద్ధమూ జరిగింది, ఓడిపోవడం కూడా జరిగింది.

కొందరు అవమానాన్ని భరించలేక యుద్ధరంగంలోనే ప్రాణాలు విడిచి పెట్టేవారుంటారు. అట్టి 'అభిమాన ధనులు' జయించడంగాని, లేదా వీరమరణం గాని కోరుకుంటారు. ఇక కొంతమంది ఓడిపోయి అరణ్యాలలో తలదాచుకున్నవారూ ఉంటారు. దాగుకొన్నంత మాత్రంచే వారికి పరాక్రమం లేదని భావించకూడదు. మృగాలపై లంఘించే పెద్ద పులి కూడా ఒక్కొక్కప్పుడు నక్కియుంటుంది కదా. అట్టి పరిస్థితే వారిది కూడా. వారు సమయానికై వేచి యుంటారు. మహమ్మదీయ ప్రభువులు దండయాత్రలను చేసే సందర్భంలో ఎందరో రాజపుత్రులు వారినెదుర్కొన్నారు. కొందరు కాలానికై వేచి యుండి అరణ్యాలలో దాగినవారూ ఉన్నారు.

మన కథలోని రాజు ఓడిపోయినా, బాధతో అవమానంతో ప్రాణాలను పోగొట్టుకోలేదు, యుద్ధరంగంనుండి తప్పుకొన్నాడు. గర్భిణియైన భార్యతో ఎవరికీ కనబడకుండా ఉన్నాడు. మంత్రి కూడా అదే త్రోవ త్రొక్కాడు.

పారిపోయే రాజు, తననెట్లాగైనా శత్రురాజు బంధిస్తాడని అనుకొంటూ ఉండగా ఒక వేటగాని గుడిసెను చూశాడు. భార్యతో గుఱ్ఱం దిగి ఇట్లా అన్నాడు. "నన్ను శత్రురాజు తప్పక పట్టుకొంటాడు. నీవా నిండు చూలాలివి, అదృష్టవశాత్తు మనకు కొడుకు పుడితే అతడైనా శత్రురాజుని ఏనాడైనా ఎదుర్కొంటాడు, సింహాసనం మీద

కూర్చుంటాడు. కనుక నీవు నాతో ఉండవద్దు. పిల్లవానిని పెంచు. ఈ గుడిసెలో దాగి ప్రాణాన్ని రక్షించుకో" అని చెప్పగా, భర్తను విడిచిపెట్టడం ఇష్టం లేకపోయినా, అతని మాటను జవదాట లేకపోయింది.

పరరాజు, మన కథలోని రాజును బంధించాడు. ఇతడు భార్యతో కలిసి వెళ్ళాడని పరరాజుకు మాత్రం తెలియదు. ఈ మాట గుఱ్ఱపు దండు వారికీ తెలియదు. రాణి గురించి ఆలోచించకుండా, మన ధర్మం మనం నిర్వహించాము కదా అని తృప్తి పడ్డారు.

ఆ గుడిసెలో వేటగాని తల్లి, ఈ రాణిని చూసి ప్రేమతో చేరదీసింది. చదువుకొన్నవారి కంటె చదువులేని వారికే ఇట్టి ప్రేమానురాగాలుంటాయి. కొంతకాలం పోయిన తరువాత పిల్లవానిని ప్రసవించి కన్నుమూసింది రాణి. తన ధర్మం నిర్వర్తించిందా అన్నట్లు తెరమరుగైంది.

కాలం గడుస్తోంది. ఆక్రమించిన రాజు రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు. కాని ప్రజలలో తృప్తి లేదు. తమ అసలు రాజు పారిపోయాడని, అతనికొక పిల్లవాడు పుట్టాడని ప్రజలకు తెలియదు.

కాని పారిపోయిన మంత్రికి రాజూ, రాణీ పారిపోయారని తెలుసు. వారికి పిల్లవాడు పుడితే ఇప్పటికి 12 ఏండ్లు అతనికి వచ్చి యుంటాయి కదా. అతడు గద్దెపై నున్న రాజుతో ఢీకొనవచ్చు కదా అని ఏవేవో కలలు గన్నాడు.

పిల్లవాణ్ణి వెదకడానికి గాలించాడు. అనుకోకుండా అడవిలో గుడిసె కనబడింది. పులిగోళ్ళు మెడలో వేసుకొని రాచఠీవి ఉట్టి పడుతున్న పిల్లవాడు, తోటి బాలురతో ఆడుకోవడాన్ని గమనించాడు. తేరిపారజూచి మన రాజకుమారుడే అనుకొన్నాడు. పిల్లవాణ్ణి పెంచిన ముసలి అవ్వ బ్రతికే ఉంది. మారువేషంలో ఉన్న మంత్రి అవ్వా అవ్వా ఎవరీ పిల్లవాడని అడిగాడు. ఆటవికులు అమాయకులు కదా! కల్లాకపటం లేని వారుకదా! ఉన్నది ఉన్నట్లు మాట్లాడడం వారి సహజ లక్షణం. ఎవరో ఒకామె వచ్చింది, పిల్లవాణ్ణి కంది, ఎవ్వరో చెప్పలేదు, నేనే ఈ పిల్లవాణ్ణి పెంచానని చెప్పింది. అతడే రాజకుమారుడని మంత్రి నిర్ణయానికి వచ్చాడు.

అసలు కథ చెప్పాడు మంత్రి. తనతో పిల్లవాణ్ణి తీసుకొని వెడతానన్నాడు. పిల్లలందరూ పిల్లవాణ్ణి విడిచిపెట్టలేకపోయారు. ఇన్నాళ్ళూ ఆ పిల్లవానితో బంధం